## క్లుప్తంగా

### ఘనంగా బంగారమ్మ పండగ



వారాడలో వెలసిన బంగారమ్మ అమ్మవారు

కె.కోటపాడు : వారాడ గ్రామస్తులు గురువారం గ్రామదేవత బంగారమ్మ అమ్మవారి పెద్ద పండగను ఘనంగా జరిపారు. ఉదయం నుండి పెద్ద సంఖ్యలో గ్రామానికి చెందిన మహిళలు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, ఎంపీటీసీ లెక్కల నాగ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### కామేశ్వరమ్మతల్లి ఆలయానికి బారులుతీరిన భక్తులు



ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం: కామేశ్వరమ్మతల్లి పండగను ఘనంగా నిర్వహించారు. మండలంలోని రాచపల్లి జంక్షన్ సమీపంలో వెలసిన కామేశ్వరమ్మతల్లి పండగను ఏటా భారీఎత్తున నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో గురువారం ఈ పండగను స్థానికులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి రాచపల్లిలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పండగలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గొలుగొండ: మండల కేంద్రంలో గురువారం పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. సర్పంచ్ కసిపల్లి బుజ్జి, కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో మజ్జిక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి అధికంగా ఉన్నందున వాహనచోదకులు, పాదచారులు, మండల కేంద్రానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీన్ని దృష్టిలో పెట్టుకుని చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉపాధి కూలీకి పాము కాటు



పాము కాటుకు గురైన చెల్లయ్య

నాతవరం: మండలంలో శృంగవరం గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువులో ఉపాధి పనులు చేస్తుండగా ఒకరు పాము కాటుకు గురయ్యారు. గ్రామానికి చెందిన నేతల చెల్లయ్య గురువారం చెరువులో పని చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే ఏపీవో చిన్నారావు చెల్లయ్యను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చెల్లయ్య ఆరోగ్య పరిస్థితి బాగుందని ఉపాధి సిబ్బంది తెలిపారు.

### బంగారుమెట్టలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట గ్రామంలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ కంటి వెలుగు ఉచిత వైద్య శిబిరంలో 128 మంది వైద్య సేవలు పొందారు. విశాఖకు చెందిన ఎల్వీ ప్రసాద్ కంటి వైద్య సిబ్బంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. బంగారుమెట్ట, ఎల్బీ పురం, లోపూడి తదితర గ్రామాల రోగులు వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందారు. కోపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జి సాయం రమేష్, సర్పంచ్ మేరుగు కుమారి బాబారావు తదితర్లు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే ధ్యేయం

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ఖండివరంలో మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, మానవత్వంతో అభాగ్యులకు సహకరించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని ఖండివరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన జగనన్న సంక్షేమ పాలనకు సంబంధించిన బుక్‌లెట్‌తో ప్రతి కుటుంబాన్ని కలిసారు. ఈ సందర్భంగా ఆయనకు చిరునవ్వుతో వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఆహ్వానం పలికారు. అర్హులైన నిరుపేద అభాగ్యులను గుర్తించి వారి సమస్యలను మానవత్వంతో పరిష్కరించాలని సీఎం ఆశిస్తున్నారని తెలిపారు. ఆ బాధ్యత సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులపై ఉందన్నారు. ఈ మేరకు మురుగునీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి జీజీఎంపీ నిధులు రూ. 20 లక్షల కేటాయింపు, సాంకేతిక కారణాలతో పింఛన్లు అందని వృద్ధుల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ఖండివరం బీటీ రోడ్డు నుంచి కనుమ చెరువు కట్టవరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 50 లక్షల కేటాయింపునకు ఆదేశాలు జారీ చేశారు. ద్విచక్ర వాహనంపై మట్టిరో పరిశీలించారు. మోసూరి వారి కల్లాల వద్ద కల్వర్టుకు రూ. 8 లక్షలతో ప్రతిపాదనలు తయారు చెయ్యాలంటు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖండివరం ఎంపీటీసీ గెంజి స్వాతిబాలాజీ, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, చీడికాడ మండల వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, చీడికాడ పీఏసీఎస్ అధ్యక్షుడు మోసూరి సన్నిబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, అధికారులు పాల్గొన్నారు.

## మురుగునీటిని పరిశీలించిన విప్ ధర్మశ్రీ



రోడ్డుపై పారుతున్న మురుగునీటిని పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ

రావికమతం: రావికమతంలో బీఎన్ రోడ్డుపై మురుగు నిలిచిపోవడంతో అటుగా వచ్చిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం ఆగి పరిశీలించారు. సోమవారమే పరిశీలించి తక్షణం పరిష్కరించాలని ఆదేశించినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఎంపీడీవో వెంకన్నబాబు, ఆర్అండ్‌బీ ఏఈ సాయిశ్రీనివాస్‌పై మండిపడ్డారు. రోడ్డంతా మురుగునీటితో దుర్గంధం వస్తున్నా ఇంత నిర్లక్ష్యమా అని ఆగ్రహించారు. రోడ్డుకిరు వైపుల ఆక్రమణ దారులకు దండోరా వేసి తెలియజేసి తక్షణం తొలగించాలని ఆదేశించారు. అయితే ప్రధాన కాలువ గ్రామం శివారులోని రైతుల పొలాల్లోకి వెళ్తుండటంతో వారు కాలువకు అడ్డంగా మట్టి వేసేశారు. దాంతో నీరంతా ఎస్సీ కాలనీలోకి చేరుతుండటంతో కాలనీ వాసులు కాలనీలోకి నీరు రాకుండా కాలువపై గోడ కట్టేశారు. దీంతో నీరంతా రోడ్డుపైకి వచ్చేస్తోందని తహసీల్దార్ మహేశ్వరరావు వివరించారు. రైతుల పొలాల్లోకి చెత్త వెళ్లకుండా మెస్ ఏర్పాటు చేసి కాలువపై ఉన్న కట్టడాలను తొలగించాలని, కాలువలపై ఉన్న దుకాణాలు, కట్టడాలను తొలగించాలని ధర్మశ్రీ అధికారులను ఆదేశించారు.

## జాగ్రత్తలతో వేసవి సమస్యలకు చెక్



డాక్టర్ లీలాప్రసాద్

మాడుగుల రూరల్: వడదెబ్బ తగ్గలకుండా ప్రతి ఒక్కరు తగు జాగ్రతలు తీసుకోవాలని కేజేపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. లీలాప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన సాక్షితో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రతలు గురించి వివరించారు. ఎండలో బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లడం గానీ, టోపీ ధరించడం గానీ చేయాలన్నారు. దూర ప్రయణాలు చేసేవారు మంచినీళ్ల బాటిల్‌తో పాటు ఉప్పు కలిపిన మజ్జిగ, నిమ్మరసం వెంట తీసుకెళ్లాలన్నారు. ఇంట్లో ఉన్నా సరే గంట గంటకు ద్రావణాలు తీసుకోవాలని, మంచి నీటితో పాటు మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన బత్తాయి, నిమ్మరసం తీసుకుంటే శరీరాన్నికి లవణాలు, పొటాషియం లాంటివి అందుతాయన్నారు. వదులుగా వుండే తెలుపు, పసుపు, నారింజ రంగు దుస్తులు ధరించాలన్నారు. అధికంగా వ్యాయామం చేయరాదన్నారు. బీర, సొర, దోసకాయ, ఆకుకూరలు తినాలన్నారు. రదోస, వుచ్చకాయ, దానిమ్మ, కర్బూజ వంటి పండ్లు, పండ్ల రసాలు తీసుకోవాలన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో జయమాధవి



పెదనందిపల్లిలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి

నర్సీపట్నం:మండలంలో వేములపూడి, యరకన్నపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో జయమాధవి పరిశీలించి కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న వారందరూ పనిలోకి రావాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి జాబ్‌కార్డులు జారీ చేస్తామన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తులు తీసుకోవాలన్నారు. అందరూ ఉదయాన్నే వచ్చి 10 గంటల లోపు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేసుకుని ఇళ్లకు వెళ్లాలన్నారు. అనంతరం వైద్యశాఖ ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏపీవో నానిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బోళం రాంప్రసాద్ పాల్గొన్నారు.

**మౌలిక వసతులు కల్పించాలి**

కె.కోటపాడు : ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న దృష్ట్యా గ్రామాల్లో పని ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించాలని వీఆర్పీలకు ఏపీవో వసంత్ తెలిపారు. మండలంలో కింతాడలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఉదయమే వచ్చి 11 గంటల వరకూ పని చేసి ఇళ్లకు చేరుకుంటే వడదెబ్బ బారిన పడే పరిస్థితి ఉండదన్నారు. వైద్య సిబ్బంది సమకూర్చిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆయన పంపిణీ చేశారు. ఏఎన్ఎం నాగమణి, వీఆర్పీ గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

**వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలి**

దేవరాపల్లి: ఉపాధి కూలీలు వడ దెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి సూచించారు. పెదనందిపల్లి, చిననందిపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. పని ప్రదేశంలో మంచినీటి సదుపాయం కల్పించడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆమె చేతులు మీదుగా ఉపాధి కూలీలకు అందజేశారు. ఎండ తీవ్రత లేని సమయంలో మాత్రమే పనులు చేపట్టాలని ఉపాధి కూలీలకు ఆమె సూచించారు. ఉపాధి హామీ ఏపీవో డి. చంద్రకళ, ఈసీ వెంకటేష్, టెక్నికల్ అసిస్టెంట్లు కె. శ్రీనివాసరావు, గోవింద్, ప్రసాద్ పాల్గొన్నారు.

## నూతన గృహాలకు ఇంటి పన్ను రశీదుల పంపిణీ



ఇంటి పన్ను రశీదుల పంపిణీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: పేదల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మేజర్ పంచాయతీ చోడవరం పట్టణంలో ఎడ్లవీధి, తామరచెరువువీధి, ప్రేమసమాజం వీధి, రెల్లివీధి ప్రాంతాల్లో సుమారు 270 మంది ఇళ్లకు కొత్తగా వేసిన ఇంటి పన్ను రశీదులను ఆయన లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఏ ప్రభుత్వ హయాంలోనూ వారి ఇళ్లకు పన్నులు వేయలేదు. ఈ పరిస్థితుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించిన ధర్మశ్రీకి వారు సమస్య వివరించడంతో ఇంటి పన్నులు వేయించి, హక్కు కల్పించారు. అనంతరం ఫిషర్‌మెన్ సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై మంజూరైన వ్యాన్‌ను ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ బండి నూకాలమ్మ, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, ఎంపీడీవో చైతన్య, తహసీల్దార్ తిరుమలరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, పంచాయతీ ఈవో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా చండీహోమం

మునగపాక : మునగపాక సంతబయలు రామాలయంలో గురువారం కనకదుర్గ అమ్మవారికి మహా చండీహోమం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వేడుకగా హోమం జరిపారు. సాయి పంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.సీతారామరాజు, శివ గణేష్, ఆది శివ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

### సాగరం వలంటీర్‌కు సేవా వజ్ర అవార్డు



గోవింద రమేష్‌నాయుడు

మాడుగుల: మండలంలో సాగరం సచివాలయంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్ పాము రామ వెంకట గోవింద రమేష్‌నాయుడుకు సేవా వజ్ర అవార్డు దక్కినట్లు ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. నవరత్నాలతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు అందించడంలో ఉత్తమ సేవలందించడం వలన రమేష్ నాయుడుకు ఈ అవార్డు దక్కినట్లు తెలిపారు. మండలానికి ఒక సేవా వజ్ర, నాలుగు సేవా రత్న అవార్డులు ఈ ఏడాది దక్కాయని తెలిపారు.

### జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

నర్సీపట్నం: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 2023–24 సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఇంగ్లీషు, తెలుగు మీడియం నందు అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. అడ్మిషన్ల కోసం కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మొదటి సంవత్సరం తరగతులు జూన్ 1 నుండి ప్రారంభమవుతాయని తెలిపారు.

### స్కూల్ టాపర్ సూర్యకళకు సన్మానం

రావికమతం: పదవ తరగతి పరీక్షల్లో 556 మార్కులతో మేడివాడ హైస్కూల్ టాపర్‌గా నిలిచిన తామరపల్లి సూర్యకళను, ఆమె తల్లితండ్రులను అనకాపల్లి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, జిల్లా బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి గానుగుల బాబ్జి తదితరులు గురువారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ సహాయ సహకారాలు ఉపయోగించుకుని విద్యార్థులంతా సూర్యకళను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి, సభ్యులు ఒంగోలు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### 'పని చేయలేకపోతే తప్పుకోవాలి'

రావికమతం: పని చేయలేకపోతే స్వచ్ఛందంగా పక్కకు తప్పుకుంటే పనిచేసే వారికి అవకాశం కల్పిస్తామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. రావికమతంలో పీపుల్స్ సర్వే, జగనన్నే మా భవిష్యత్ వంటి కార్యక్రమాలు చేపట్టడంలో ఆ గ్రామ వలంటీర్లు సరైన శ్రద్ధ కనబరచలేదు. పీపుల్స్ సర్వే 30 శాతానికి మించి లేదు. దీంతో గ్రామంలో ఉన్న 22 మంది వలంటీర్లతో ధర్మశ్రీ గురువారం ప్రత్యేక సమావేశమయ్యారు. నిర్ణీత సమయానికి కచ్చితంగా పని చేయాలని, లేదంటే తప్పుకోవాలన్నారు.

### ఎ.కోడూరులో ఫ్యామిలీ ఫిజీషియన్

కె.కోటపాడు : ప్రాథమిక దశలోనే మెరుగైన వైద్యం పొందడం వలన అనారోగ్య సమస్యలు దూరమవుతాయని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్వీ శ్రావ్య అన్నారు. ఎ.కోడూరు గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు నిర్వహించారు. 169 మందికి వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందించారు. 12 మందికి ఇల్లకు వెళ్ళి వైద్యం అందించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ప్రమీల, హెచ్ఎస్ సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, శాంతి, సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

**తుమ్మవానిపాలెంలో..**

మాడుగుల రూరల్: మండలంలోని తుమ్మవానిపాలెంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 47 మందిని వైద్య సిబ్బంది పరీక్షించారు. వైద్యాధికారి కేఎం నాయుడు సారధ్యంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమములో ఏఎన్ఎం భవానీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం రేపు

దేవరాపల్లి: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని శనివారం ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సభ్యులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పే విధంగా అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలన్నారు.

## ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ

రోలుగుంట: ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఏపీజీవీబీ అధిక వడ్డీ అందిస్తుందని బ్రాంచి మేనేజర్ నందిని సాహు తెలిపారు. బ్యాంక్ అందిస్తున్న సేవలపై గురువారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వెలుగు ఏపీఎం కె.సాధన అవగాహన సదస్సు నిర్వహించారు. పాల్గొన్న బ్రాంచి మేనేజర్ చిన్న పరిశ్రమలు, కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలు సకాలంలో చెల్లించే వారికి వర్తించే లాభాలు, రాయితీల గురించి వివరించారు. తమ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 7.5 నుంచి 8 శాతం వరకూ వడ్డీ చెల్లిస్తున్నామని, ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఆక్రమణలు తొలగించాలంటూ ప్రచారం

రావికమతం: రావికమతంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఇరువైపుల కాలువలపై ఉన్న ఆక్రమణలను వ్యాపారులు ఈ నెల 20లోగా స్వచ్ఛందంగా తొలగించాలని లేని పక్షంలో యంత్రాల సహాయంతో తామే తొలగిస్తామంటూ కార్యదర్శి సత్యారావు గురువారం ఆటో ద్వారా మైక్ ప్రచారం చేశారు. కాలువల ఆక్రమణ వలన మురుగు నీరంతా రోడ్డుపై ప్రవహించడంతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సోమవారం పరిశీలించి ఆగ్రహించారు.

## సంక్షేమ పాలనకు మళ్లీ జగనన్ననే ఎన్నుకుందాం



సమస్యలపై మహిళను ఆరా తీస్తున్న విప్ ధర్మశ్రీ

రావికమతం: జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే పేదలకు పథకాలు అందుతున్నాయని, మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా చేసుకుని మరిన్ని పథకాలు పొందుదామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. దాసరయ్యపాలెం, గొల్లలపాలెం, రాయవరం, దుర్గానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ తిరిగి పథకాలన్నీ అందుతున్నాయా, ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తమ కుటుంబానికి చెందిన 14 మంది ఒకే చోట పశువుల పాకలు వేసుకుని వ్యవసాయం చేస్తున్నామని తాగునీటికి ఇబ్బందులున్న దృష్ట్యా బోరు కావాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రాము, చినతల్లి ఇల్లు మంజూరు చేయాలని కోరగా అక్కడే ఉన్న ఏఈ గోపీనాథ్‌కు మంజూరు చేయాలని ఆదేశించారు. ఇంటిపై కరెంటు తీగలు వేలాడుతున్నాయని భయం భయంగా ఉన్నందున తొలగించాలని, లోవోల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని దాసరయ్యపాలెంలో సాసుబిల్లి దుర్గమ్మ ధర్మశ్రీ దృష్టికి తేగా తక్షణం సమస్యలు పరిష్కరించాలని ఏఈ నందన్‌కు ఆదేశించారు. రాయవరంలో గెడ్డపై వంతెన ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తమ్మునాయుడు, రాజీబాబు తదితరులు ఆయనకు వినతిపత్రం అందించారు. ఎంపీపీ పైల రాజు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, ఆ గ్రామ సర్పంచ్ లావణ్య, వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, గంటా ఈశ్వరరావు, తహసీల్దార్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

## ఇంటిపై రాఖీ పొదుతో చల్లచల్లగా..



రాఖీపొదుతో ఇల్లు చల్లగా ఉంటుందంటున్న అప్పలనాయుడు, అతని కుటుంబ సభ్యులు

రావికమతం: గొల్లలపాలెం గ్రామానికి చెందిన కొర్రా అప్పలనాయుడు ఇంటి పైకప్పుగా సిమెంట్ రేకు వేసుకున్నారు. అయితే ఎండ వేడిమి నుంచి కాపాడుకునేందుకు రాఖీ పుష్పాల పొదు ఇంటి పైకప్పు అంతా పరుచుకునేలా మళ్లించుకున్నారు. దీంతో ఇంటి పైకప్పంతా పొదు దట్టంగా అల్లుకుని రేకు వేడెక్కకుండా చల్లదనాన్నిస్తోంది. మూడేళ్లుగా ఇలాగే చల్లదనాన్ని పొందుతున్నామని నర్సరీ నిర్వహించే అప్పలనాయుడు తెలిపారు. కడియంలో నర్సరీలో పని చేస్తుండగా అక్కడ ఈ విధంగా పలువురు ఏర్పాటు చేసుకోవడం చూసి తానూ ఇంటి పైకప్పుకు ఆ పొదును ఎక్కించినట్టు చెప్పారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా వచ్చిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అప్పలనాయుడును అభినందించారు.

## రెజ్లర్లను వేధించిన ఎంపీని అరెస్టు చేయాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

నర్సీపట్నం: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.సుబ్బలక్ష్మి డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో ఎదుట మహిళా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ ఖ్యాతి గడించిన భారత స్టార్ మహిళా రెజ్లర్లు లైగింక వేధింపులపై ఫిర్యాదు చేస్తే తిరస్కరించారన్నారు. రెజ్లర్లను బెదిరిస్తున్న ఎంపీని పదవి నుండి తొలగించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, నాయకులు సత్తిబాబు, ఎల్.గౌరీ, కేవీ సూర్యప్రభ, మాకిరెడ్డి రామునాయుడు, గురుబాబు, ప్రసన్న, కనకమహాలక్ష్మి, శివలంక కొండలరావు, ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

నాతవరం: ప్లాస్టిక్ వాడకంతో పలు అనర్థాలు వస్తున్నాయని, పర్యావరణానికి కూడా నష్టం జరుగుతుందని గ్రామాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలో దద్దుగుల, గుమ్మిడికొండ, రామన్నపాలెం, మాసంపల్లి తదితర గ్రామాల్లో అటవీశాఖ సెక్షన్ అధికారి మహేష్ ఎగిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకం పూర్తిగా మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

మాకవరపాలెం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని సామాజిక అటవీ విభాగం నర్సీపట్నం సెక్షన్ అధికారి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కొండలఅగ్రహారంలో గురువారం ఉపాధి కూలీలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇళ్లు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. దీని వల్ల పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో అటవీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరం.. భవిత బంగారం



ఆంగ్ల శిక్షణకు హాజరైన విద్యార్థులు



చొడువాడలో వేసవి శిబిరానికి హాజరైన విద్యార్థులతో వెంకటరావు

నర్సీపట్నం: శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరంలో గురువారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన కల్పించారు. సీహెచ్ భవానీ డిక్షనరీ వినియోగంపై అవగాహన కల్పించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకరరావు దేశభక్తి గీతాలు పాడించారు. కథలు బోధించి నిత్య జీవితంలో ఎలా మెలగాలో విద్యార్థులకు సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో గ్రంథాలయాధికారి పి.దమయంతి, ఉపాధ్యాయులు కె.లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

**వేసవి శిబిరాలు వినియోగించుకోవాలి**

కె.కోటపాడు : సెలవుల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.వెంకటరావు అన్నారు. చొడువాడ శాఖా గ్రంథాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. పిల్లలు శిబిరాల్లో ఏ అంశాలు నేర్చుకుంటున్నారో గ్రంథ పాలకురాలు ఎం.పద్మావతిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు పుస్తక పఠనం, డిబేట్, బొమ్మల కథలు, చిత్రలేఖనం వంటి అంశాల్లో పిల్లలు తర్ఫీదు పొందుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతు విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.